# నేడు జగిత్యాల, వేములవాడకు అధినేత కేసీఆర్



జగిత్యాల జిల్లా కేంద్రంలో సిద్ధమైన ప్రజా ఆశీర్వాద సభా వేదిక

■ ప్రజా ఆశీర్వాద సభలకు హాజరుకానున్న ప్రగతి ప్రదాత ■ భారీ జన సమీకరణకు సన్నాహాలు ■ జగిత్యాలలో ఏర్పాట్లను పరిశీలించిన రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు ■ మరో జగిత్యాల జైత్రయాత్ర కావాలని పిలుపు ■ వేములవాడలో పరిశీలించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ వేములవాడ/ జగిత్యాల కలెక్టరేట్ : ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు అన్నివిధాలా కలిసొచ్చిన పూర్వ కరీంనగర్ గడ్డ నుంచే ఈ సారి కూడా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2014, 2018 ఎన్నికల సమయంలో హుస్నాబాద్ వేదికగానే ప్రారంభించి, విజయం అందుకొని అధికారం చేపట్టిన ఆయన, మరోసారి ఇక్కడి నుంచే రంగంలోకి దిగారు. గత నెల 15న హుస్నాబాద్ వేదికగా ప్రజా ఆశీర్వాద సభలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పద మూడు నియోజకవర్గాలకు గాను పదకొండు సభలు పూర్తి చేశారు. గత నెల 15న హుస్నాబాద్, 17న సిరిసిల్ల, ఈ నెల 2న ధర్మపురి, 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లి, 17న ఒకే రోజు కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. తిరిగి ఈ నెల 20న మానకొండూర్, 24న రామగుండం సభలకు హాజరై దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు అన్ని చోట్లా సభలు గ్రాండ్ సక్సెస్ కాగా, ఆదివారం జగిత్యాల, వేములవాడలో నిర్వహించే సభలకు హాజరు కాబోతున్నారు. ఎన్నికల వేళ ప్రజలను చైతన్యం చేయనున్నారు.

### జగిత్యాలలో మాకునూరు సంజయ్ కుమార్‌కు మద్దతుగా..

బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకునూరు సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయం గ్రౌండ్‌లో ప్రజా ఆశ్వీరాద సభ నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులంతా సన్నాహాలు చేస్తున్నారు. శనివారం సభా ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ పరిశీలించారు.

### వేములవాడలో 'చల్మెడ'కు మద్దతుగా..

బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఆదివారం వేములవాడ కోర్టు సమీపంలోని మైదానంలో ప్రజా ఆశ్వీరాద సభకు నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులంతా సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సీనియర్ నాయకులు లోక బాపురెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డి, తీగల రవీందర్‌గౌడ్ అన్ని మండలాల కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు.


### భారీ జన సమీకరణకు సన్నాహాలు

గులాబీ బాస్ ఆదివారం జగిత్యాల, వేములవాడ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సభల విజయవంతం కోసం బీఆర్‌ఎస్ నాయకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ జన సమీకరణ కోసం సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ గ్రామ స్థాయి నుంచి మొదలుకొని, పట్టణ స్థాయి, ముఖ్య కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా రెట్టింపు ఉత్సాహంతో కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్నిమండలాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావాలని పిలుపునిస్తున్నారు.

### మరో జగిత్యాల జైత్రయాత్రను తలపించాలి

■ రాజ్యసభ ఎంపీ దీవకొండ దామోదర్‌రావు

సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ మరో జగిత్యాల జైత్రయాత్రను తలపించాలని రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి శనివారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని గీతా విద్యాలయం గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రగతి ప్రదాతకు కృతజ్ఞత తెలుపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్తులో చేయబోయే ప్రణాళికను సీఎం వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు రాజ్‌కుమార్, శివకేసరి బాబు, బీఆర్‌ఎస్ నాయకులు ఒద్ది రాంమోహన్‌రావు, సమిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● డీఈవో పమేలాసత్పతి

కలెక్టరేట్, నవంబర్ 25: ఈనెల 30న జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో జరుగనున్న సాధారణ ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సెక్టోరల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ప్రతి సెక్టోరల్ అధికారి పది నుంచి పదిహేను పోలింగ్ కేంద్రాలు పరిశీలించాల్సి ఉంటుందని వెల్లడించారు. వీరికి అందుబాటులో బీఎల్‌వోలు, ఎంపీడీవోలు ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాలనుసరించి ప్రతీ పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈవీఎం సమస్యలు వస్తే సత్వరమే సరి చేయాలని, పరిష్కారం లభించని పక్షంలో ఈవీఎంను మార్చాలని ఆదేశించారు. ప్రతి సెక్టోరల్ అధికారి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను కనీసం మూడు సార్లైనా సందర్శించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా కింది స్థాయి సిబ్బందిని పురమాయించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లైతే వాటిని వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను జాగ్రత్తగా పోలీసు భద్రతతో ఆయా నియోజకవర్గాల రిసిప్షన్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మాధవి, మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే..కరెంటు కోతలే

● 3 గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు సాధ్యమైతయా?
● పదేండ్లల్లో హుస్నాబాద్ రూపురేఖలు మార్చినం
● రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 25: అస్థిరతకు, అధికార దాహానికి మారుపేరైన కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కోతలు, కరువు కాటకాలు విలయ తాండవం చేస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు పెడితే వ్యవసాయం నడుస్తుందా..? అని ప్రశ్నించారు. వ్యవసాయంపై ఏమాత్రం అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారన్నారు. 2014కు ముందు ఉన్న పరిస్థితులను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ తన విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్ చేశారని కొనియాడారు. అంతకు ముందు ఉన్న మత కలహాలు గానీ, బాంబుపేలుళ్లు గానీ లేకుండా రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉంచామన్నారు. ఇలాంటి రాష్ట్రాన్ని కాంగ్రెస్ నాయకుల చేతిలో పెట్టి కుక్కలు చింపిన విస్తరి చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రాత్రిపూట కరెంటే గతవుతుందన్నారు. కరువు కాటకాలతో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రూపురేఖలు మార్చిన ఘనత స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌దేనన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి పూర్తి చేయిస్తుంటే అడగడుగునా అడ్డుకున్నది కాంగ్రెస్ నాయకులేనని ఆరోపించారు. నియోజకవర్గంపై అవగహన లేకుండా, ఒక ఎజెండా లేకుండా హుస్నాబాద్‌కు వచ్చి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి సతీశ్ కుమార్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు.



హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

### పదేండ్లలో కరువును పారదోలినం

● బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

తాగునీటికి సైతం అల్లాడే హుస్నాబాద్ నియోజకవర్గంలో కరువును పూర్తిగా పారదోలడంతో పాటు సాగునీటి సౌకర్యాన్ని పెంచి పంటల దిగుబడి పెంచామని, అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను అందించామని ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదిస్తే, హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి ఇబ్బందిని తొలగించామని చెప్పారు. మహాసముద్రంగండి, శనిగరం, సింగరాయ ప్రాజెక్టులను అభివృద్ధి చేసుకోవడంతో పాటు మిషన్ కాకతీయ ద్వారా 406చెరువులను మరమ్మతు చేశామన్నారు. మిడ్‌మానేరు, దేవాదుల ద్వారా నియోజకవర్గంలో సుమారు 60వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నామని తెలిపారు. 16 విద్యుత్ సబ్‌స్టేషన్లు, 4,800ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొచ్చి లోవోల్టేజీ సమస్యను తరిమేశామని గుర్తు చేశారు. ప్రతి గ్రామానికి తారు రోడ్లు వేసి రవాణా సౌకర్యాన్ని పెంచడంతో హుస్నాబాద్ పట్టణంలో వర్తక, వాణిజ్యం, వ్యాపారం గణనీయంగా పెరిగి పెద్ద పట్టణంగా రూపాంతరం చెందిందని వివరించారు. 30 పడకలుగా ఉన్న దవాఖానను 100 పడకలుగా మార్చామని, 65 రకాల రక్త పరీక్షలు ఇక్కడే చేస్తున్నామని చెప్పారు. మరోసారి తనను ఆశీర్వదించాలని సతీశ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, ఎస్‌ఎల్‌సీఎఫ్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఎండీ అన్వర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మధూకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

REAL ESTATE

★రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర|| సెల్: 9381128358
NTK-316684

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

